www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 9 సెప్టెంబర్ 2025



వైద్య చికిత్సలో ఫిజియోథెరపీ విధానం కీలకం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

వైద్య చికిత్సలో ఫిజియోథెరపీ వైద్య విధానం కీలక పాత్ర పోషిస్తుందని వైద్య నిపుణురాలు డాక్టర్ కొత్తా కీర్తి పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవంలో ఆమె మాట్లాడారు. ఫిజియోథెరపీ ఛాతి, గుండె, కండరాల నొప్పులు, పక్షవాతం, అంగవైకల్యంతో పాటు క్యాన్సర్ వల్ల వచ్చే నొప్పులకు చక్కటి ఉపశమనం లభిస్తుందన్నారు. డాక్టర్ అడ్డాల సత్యనారాయణ మాట్లాడారు. సిడిపిఒ వై.లక్ష్మి, ఎస్.శ్రీనగేష్, బుద్ధరాజు సత్యనారాయణ రాజు, డాక్టర్ శిరీష, అడబాల రత్నప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, ప్రసాద్ నాయుడు, చింతపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


సబ్‌ప్లాన్ సమస్యలపై ఆదివాసీల కదం

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

సబ్ ప్లాన్ గ్రామాల ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, పెదమల్లాపురం కేంద్రంగా మండలాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ గిరిజనులు కాకినాడలో కదం తొక్కారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు గిరిజనుల సాంప్రదాయ నృత్యాలతో ప్రదర్శన చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. కలెక్టర్ షాన్‌మోహన్ సగిలికి వినతిపత్రం అందజేశారు. గిరిజన హక్కుల సాధన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఆందోళనలో అఖిల భారత ఆదివాసీ సంఘం, ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ సంఘం, ఎపి ఆదివాసీ గిరిజన సంఘం, కొండరెడ్డి సంక్షేమ సంఘం, కమ్మర తెగ సంక్షేమ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, లోవర్తి సర్పంచ్ లోత రామారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలో భాగంగానే కాకినాడ జిల్లాలో ఉన్న సబ్ ప్లాన్ గిరిజన గ్రామాలైన 59 గ్రామాలను కలుపుకొని పెదమల్లాపురం కేంద్రంగా గిరిజన మండలాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అప్పట్లో ఏలేశ్వరంలో ఏర్పాటు చేసిన ఎన్నికల సభలో డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ సబ్ ప్లాన్ గ్రామాల సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆ హామీని తక్షణమే అమలు చేసి ఆ ప్రాంత గిరిజనుల చిరకాల కోరిక నెరవేర్చాలని డిమాండ్ చేశారు. గిరిజనులైనప్పటికీ 5వ షెడ్యూల్‌లో లేకపోవడంతో గిరిజనులకు రక్షణగా ఉన్న 1/70 చట్టం, పిఇఎస్ఎ చట్టం ప్రకారం రిజర్వేషన్ వర్తింపచేయకపోవడంతో తమకు భూమి మీద రక్షణ లేదన్నారు. గ్రామ సభలకు అధికారం లేదని తెలిపారు. చదువుకున్న యువతకు ఉద్యోగావకాశాలు లేవని ఆవేదన వ్యక్తం చేసారు. ఐటిడిఏ ఫలాలు అందక ఇప్పటికీ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నారని రామారావు వాపోయారు. పెద్దమల్లాపురం మండల సాధన కమిటీ నాయకులు మునుసుల బాలరాజు, జర్త సరస్వతి, కించి అప్పలకొండ, గ్రామ సర్పంచులు గుండు చెంచుబాబు, గంగరాజు మాట్లాడారు. 40 ఏళ్లుగా ఇదే డిమాండ్ కోసం ఉద్యమాలు చేస్తున్నామన్నారు. 1999 నుంచి అసెంబ్లీ ఎన్నికలలో బ్యాలెట్ బాక్స్‌లో ఓటు తో పాటు పెదమల్లా పురం మండల కేంద్రం చెయ్యాలని స్లిప్ వేశామన్నారు. కౌంటింగ్‌లో లెక్క వేయగా ఆ స్లిప్‌లు 16 వేలు వచ్చాయన్నారు. తాము సబ్-ప్లాన్ ఏరియాలో ఉండడం వల్ల కుల ధ్రువీకరణ పత్రాలు, ఉద్యోగావకాశాలు, వైద్య సదుపాయాలు అందడం లేదన్నారు. తమ గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెదమల్లాపురం కేంద్రంగా మండలాన్ని తక్షణమే ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో తమ పోరాటం మరింత ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. గిరిజన హక్కుల సాధన సంఘం ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలు గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు. వీరి ఆందోళనకు సిపిఎం జిల్లా నాయకులు ఎం.రాజశేఖర్ మద్దతు తెలిపారు. వెంకటరమణ, నాగేశ్వరావు, దొంగబ్బాయి, చిన్నయ్య, సత్తిబాబు, చెల్లరావు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఆదివాసీలు


కలెక్టరేట్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ట్రంప్ సుంకాలపై కేంద్రం స్పందించాలి

ప్రజాశక్తి-కాకినాడ

భారత సరుకులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధిస్తున్న సుంకాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని సిపిఎం జిల్లా విస్తత సమావేశం డిమాండ్ చేసింది. సోమవారం స్థానిక సుందరయ్య భవన్‌లో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు మోర్త రాజశేఖర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో తొలుత అమరవీరులకు ఘనంగా నివాళి అర్పించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి. బలరాం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ అమెరికన్ సామ్రాజ్యవాదం వర్ధమాన దేశాలపై పెత్తనం కోసం నిరంతరం చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగానే ప్రస్తుత సుంకాల పెంపు ఉందన్నారు. చిన్న చిన్న దేశాలు కూడా అమెరికాను ఎదిరించి మాట్లాడుతున్నాయని పేర్కొన్నారు. కానీ భారత ప్రధాని మోడీ దేశభక్తి గురించి మాట్లాడుతున్నా ఆచరణలో మన దేశాన్ని అమెరికాకు జూనియర్ భాగస్వామిగా మార్చేస్తున్నారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశ ప్రయోజనాల కోసం, సార్వభౌమత్వ పరిరక్షణ కోసం నిలబడాలని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు మాట్లాడుతూ ప్రస్తుత సుంకాల వల్ల జిల్లాలో పెద్ద ఎత్తున ఆక్వా, వ్యవసాయ రంగాలు దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన ఈ రంగాలను ఆదుకోవాలని, ఉపాధిని నిలబెట్టాలని కోరుతున్నామన్నారు. సిపిఎం కార్యకర్తలు ప్రజా సమస్యలపై కృషి చేయాలని, సెప్టెంబర్ 12న సీతారాం ఏచూరి వర్ధంతి ఘనంగా నిర్వహించాలని పిలుపు ఇచ్చారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు దువ్వా శేషబాబ్జీ, టేకుమూడి ఈశ్వరరావు, సిహెచ్.రమణి, నీలపాల సూరిబాబు, పలివెల వీరబాబు, జి.అప్పారెడ్డి, దారపురెడ్డి క్రాంతి కుమార్, టి.నాగేశ్వరరావు, కె.సత్తిరాజు, కె.వీరబాబు, నక్కెళ్ల శ్రీనివాస్, షేక్ పద్మ, మలకా వెంకటరమణ, టి.రాజా, సిరిపురపు శ్రీనివాస్, మేడిశెట్టి వెంకటరమణ, సిహెచ్.అజయ్ కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బలరామ్

పిజిఆర్ఎస్ అర్జీలను వెంటనే పరిష్కరించాలి

ప్రజాశక్తి-కాకినాడ

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందిన అర్జీలను పారదర్శకతతో, నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జెసి రాహుల్ మీనా, డిఆర్ఒ జె.వెంకటరావు, హౌసింగ్ పీడీ ఎన్‌వివి.సత్యనారాయణ, బిసి కార్పొరేషన్ ఇడి ఎ.శ్రీనివాసు, ఎస్-ఎస్ఎ పిఒ వేణుగోపాలరావు తదితర అధికారులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై సత్వరం సమగ్రమైన విచారాణ చేపట్టి తగిన పరిష్కారం అందించాలని అధికారులను ఆదేశించారు. బియ్యం కార్డు మంజూరు, కార్డులోని పేర్లు మార్పులు చేర్పులు, పింఛన్లు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, ఇళ్ల స్థలాలు, భూమి వివరాలు ఆన్ లైన్లో నమోదు, రీ సర్వే, ఆక్రమణలు తొలగింపు, డ్రైన్, కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుద్ధ్యం, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ ఆన్ లైన్ సమస్యలు వంటి అంశాలకు చెందిన మొత్తం-480 అర్జీలు అందాయి.


అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ షాన్ మోహన్ రగిలి

సీనియర్ సిటిజన్స్ కమిషన్ నియమించాలి

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

జనాభాలో 15 శాతం ఉన్న సీనియర్ సిటిజన్స్ సంక్షేమ కోసం రాష్ట్ర ప్రభుత్వం కమిషన్ ఏర్పాటు చేయాలని సీనియర్ సిటిజన్స్ సంఘం సర్వసభ్య సమావేశం తీర్మానించింది. స్థానిక బోట్ క్లబ్ ఉద్యానవనంలో సంఘం అధ్యక్షుడు బుద్ధరాజు సత్యనారాయణ రాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పలు తీర్మానాలను ఆమోదించారు. రాష్ట్ర మెడికల్ ఎడ్యుకేషన్ మాజీ డైరెక్టర్ రాఘవేంద్రరావు మాట్లాడారు. పింఛనుదారుల సంఘం అధ్యక్షుడు శాస్త్రిని ఘనంగా సత్కరించారు. అనంతరం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బుద్ధరాజు సత్యనారాయణరాజు, ప్రధాన కార్యదర్శిగా అడబాల రత్నప్రసాద్, కోశాధికారిగా డివి.సత్యనారాయణ రాజు, కార్యనిర్వాహక కార్యదర్శిగా సిహెచ్‌వి.వెంకటరావు, న్యాయ సలహాదారుడుగా యనమల రామం ఎన్నికయ్యారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

ప్రజాశక్తి- తాళ్లరేవు, రౌతులపూడి

తాళ్లరేవులో సోమవారం ఎంపిపి రాయుడు సునీత అధ్యక్షతన ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు బి.వెంకటేశ్వర్లు, జి.రాంబాబు, రతీ పార్వతి, ఎం.బంగార్రాజు, పి.అప్పారావు, జి.శివశంకరంను సత్కరించారు. ఎంపిడిఒ కె.సత్యనారాయణ, ఎంఇఒలు మంగాయమ్మ, ఎం.ఉమ, జెడ్‌పిటిసి దొమ్మేటి సామ్యూల్ సాగర్, వైస్ ఎంపిపి ధూళిపూడి నాగేంద్రప్రసాద్, ప్రజా సంఘాల నాయకులు టేకుమూడి ఈశ్వరరావు, ఉంగరాల వెంకటేశ్వరరావు, గంజా సూరిబాబు, బిళ్లకుర్తి శ్రీనివాసరెడ్డి, యడ్ల కుటుంబరావు, పి.మల్లవరం సర్పంచ్ పంపన రామకష్ణ పాల్గొన్నారు.


తాళ్లరేవులో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎంపిపి

రౌతులపూడి ఉత్తమ ఉపాధ్యాయులు హెచ్ఎంలు యర్రా శ్రీనివాస్, గోడి ప్రసన్న, ఎ.ఉమామహేశ్వరి, ఎల్.రమణ బాబు, జి.సీతాకుమారి, ఇ.దేవరాజు, పి.లక్ష్మణరావు, కె.చిట్టిబాబును సత్కరించారు. కె.హరిబాబు, అచ్చిరాజు, ఆర్‌విఆర్.మూర్తి, బి.తాతబాబు, నాగరాజు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

ఒత్తిడిని అధిగమించేందుకు విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - కాకినాడ

ఒత్తిడి ఎలా ఎదుర్కోవాలి, ఆత్మహత్య ఆలోచనలను ఎలా అధికమించాలనే విషయాలపై జెవివి ఆధ్వర్యంలో దీన్ దయాళ్ గ్రామీణ కౌశల్ యోజన స్కిల్ డవలప్‌మెంట్ సెంటర్‌లో ప్రభుత్వ వైద్యుడు, ప్రముఖ సైకియాట్రిస్ట్ డాక్టర్ వానపల్లి వరప్రసాద్ ప్రసంగించారు. మంచి కుటుంబవ్యవస్థ, స్నేహితులు, బంధువులను కలిగి ఉండాలని, కెరియర్‌ను ఉన్నతంగా మలుచుకోవాలనే ఒత్తిడి, ఆధునిక ఆలోచనలు మనుషులను ప్రేరణకు గురి చేస్తున్నాయని, వాటిని సరైన విధంగా మలుచుకుంటే విజయాలు చేకూరతాయని లేకుంటే కుంగుబాటుకు గురవుతారని వివరించారు. ఒక మేరకు ఒత్తిడి అవసరమే గాని మితిమీరిన ఒత్తిడి మానసిక వ్యాధులను తెచ్చిపెడతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో వి.రవికుమార్, కరస్పాండెంట్ సాయిబాబు, ప్రిన్సిపల్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



యూరియా కొరతపై నిరసనలు

ప్రజాశక్తి-పిఠాపురం

యూరియా కొరత సమస్య పరిష్కరించాలని సిపిఎం మండల కన్వీనర్ కె.చిన్న అధ్యక్షతన సోమవారం నిరసన తెలిపారు. పార్టీ జిల్లా నాయకులు డి.శేషబాబ్జి హాజరై మాట్లాడారుఉ. రైతులకు సమృద్ధిగా యూరియా అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు యూరియా కొరత లేదని మాటల్లో చెబుతున్నారు తప్ప యూరియా కోసం రైతులు అవస్థలు పడవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఉప్పాడ-పిఠాపురం రైల్వే ఫ్లయ్ ఓవర్ బ్రిడ్జి ఒక సంవత్సరంలో పూర్తి చేస్తామని డిప్యూటీ సిఎం పవన్ హామీ ఇచ్చారని నిర్మాణానికి నిధులు ఇచ్చామని ప్రకటించారు తప్ప ఆ నిర్మాణం ఎంతవరకు వచ్చినదో ఎవరికీ తెలియని పరిస్థితి నెలకొందన్నారు. మున్సిపాలిటీలో పరిధిలో పలు వార్డుల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా, శానిటేషన్ నిర్వహణ అధ్వానంగా ఉందన్నారు. అనంతరం పాడా ఎపిడి వసంత మాధవికి వినతిపత్రం అందజేశారు. ఈ నిరసనకు బిఎస్‌పి కండవల్లి లోవరాజు, కౌన్సిలర్ బోనాసుల శివ మద్దతు తెలిపారు. సిపిఎం నాయకులు కోనేటి రాజు, నాగేశ్వరరావు, వీరబాబు, విశ్వనాథం, కె.మణి, వి.సూర్యనారాయణ, పి.సత్యనారాయణ, కృష్ణవేణి, గోపాలకృష్ణ, అరుణ్ కుమారి, వి.నాగు, జి.అప్పారావు, ఉదయ్ భాస్కర్, నరసింహమూర్తి, బి.రాంబాబు, కె.అపర్ణ, దేవుడబ్బాయి, నున్న, సూరిబాబు పాల్గొన్నారు.



సామర్లకోటలో సిపిఐ నాయకుల నిరసన


పిఠాపురంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా నాయకులు డి.శేషబాబ్జి

సామర్లకోట ఎరువుల కొరతను తక్షణమే నివారించి, దోపిడీ దళారీ వ్యవస్థను అరికట్టాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో తహశీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. సిపిఐ పట్టణ కార్యదర్శి పెదిరెడ్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ధర్నాలో జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ, సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, ఎ.భవాని, పెదిరెడ్ల అర్జున్‌రావు, మడగల రమణ, బర్ల లక్ష్మీనారాయణ, నరసింహాచార్యులు పాల్గొన్నారు.

సంపూర్ణ అక్షరాస్యతే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

బడి ఈడు పిల్లలంతా నూరు శాతం పాఠశాలలోనే ఉంటూ విద్యను అభ్యసించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తుందని సిడిపిఒ వై.లక్ష్మి పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా సోమవారం అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆరేళ్ల లోపు పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో బొమ్మలు, వివిధ రకాల ఆట వస్తువులతో విద్యను అందిస్తున్నట్టు తెలిపారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా చిన్నారులకు పూర్తిస్థాయిలో విద్యాబోధన అందుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, డాక్టర్ శిరీష, బుద్ధరాజు సత్యనారాయణ రాజు, ఎస్.శ్రీనగేష్, చింతపల్లి సుబ్బారావు పాల్గొన్నారు.



తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఉపాధి కార్మికులు

ఉపాధి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- తాళ్లరేవు

ఉపాధి కార్మికుల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని, మేట్స్‌కు సదుపాయాలు కల్పించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తహశీల్దారు కార్యాలయం వద్ద ప్రదర్శన, ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టేకుమూడి ఈశ్వరరావు, కెఎస్.శ్రీనివాస్ మాట్లాడారు. ఉపాధి హామీ చట్టంలో 15 రోజులలో వేతనాలు ఇవ్వాలని ఉందని, ఈ చట్టాన్ని ఉల్లంఘించిన కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు పనులు చేసి మూడు నెలలు గడుస్తున్నా వేతనాలు వేయకుండా చట్టాన్ని ధిక్కరిస్తోందన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం, ప్రతిపక్ష వైసిపి ఉపాధి శ్రామికులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, కనీసం కేంద్ర ప్రభుత్వాన్ని వేతనాలు కోసం అడగడం లేదని, ఇది చాలా దుర్మార్గం అన్నారు. రాష్ట్రంలో అత్యధికమంది వ్యవసాయ కార్మికులు, ఉపాధి శ్రామికులు కష్టపడి పని చేస్తుంటే వారికోసం ఈ ప్రభుత్వం మాట్లాడకపోవడం చాలా విచారకరమన్నారు. ఈ ధర్నాలో వల్లు రాజబాబు, గోడి భాస్కరరావు, బొక్కా వెంకటరమణ మాట్లాడారు.

ప్రజా కళారూపాల ద్వారానే ప్రజా చైతన్యం

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రజా సమస్యల పట్ల ప్రజలకు అవగాహన పెంచడంలో ప్రజా కళారూపాలు ఎంతో ప్రాముఖ్యత వహిస్తాయని సాహితీ స్రవంతి గౌరవాధ్యక్షులు చల్లా విశ్వనాథం అన్నారు. సోమవారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు దారపురెడ్డి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన డాక్టర్ గరికపాటి రాజారావు వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. పెట్టుబడిదారీ, సామ్రాజ్య విష సంస్కృతితో పెన వేసుకున్న కార్పొరేటీకరణ భారతీయ కళారంగాలను ఆక్రమించుకుని ప్రజా చైతన్యాన్ని నిర్వీర్యం చేస్తోందన్నారు. దీనికి వ్యతిరేకంగా అన్ని రకాల కళా రంగాలు ప్రజా చైతన్యం కోసం కలిసికట్టుగా పోరాటం చేయాలన్నారు. సీనియర్ కళాకారుడు డి.సత్యనారాయణ, దారపురెడ్డి కృష్ణ, రొంగల వీర్రాజు మాట్లాడారు. కుంచే అచ్చారావు, మహాపాతిన రాంబాబు, సిరపరపు శ్రీనివాస్, ఎన్.నరసింహమూర్తి, గూనూరు వెంకటరమణ, నీలం శ్రీనివాస్, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.


రాజారావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న నాయకులు

10న సుందరయ్య భవన్‌లో కవి సమ్మేళనం

ప్రజాశక్తి-కాకినాడ

సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఈ నెల 10న సుందరయ్య భవన్‌లో కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్టు సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 12 సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి నేపథ్యంలో సీతారాం ఏచూరి, సమసమాజ ఆలోచన అనే అంశంపై జరుగుతున్న ఈ కవి సమ్మేళనంలో ఆసక్తి గల సాహితీ ప్రియులంతా పాల్గొనాలని కోరుతున్నామన్నారు.

పోస్ట్ ఆఫీస్ సేవలపై శిక్షణ

ప్రజాశక్తి - పెద్దాపురం

పోస్ట్ ఆఫీస్ నుంచి అమలు చేస్తున్న అన్ని రకాల సేవలపై డిజిటల్ లక్ష్మిలు అవగాహన పెంచుకోవడం ద్వారా డ్వాక్రా మహిళలను ఈ సేవలలో భాగస్వాములను చేయాలని హెడ్ పోస్ట్ ఆఫీస్ సీనియర్ మేనేజర్ కె.రాజకుమార్ అన్నారు. సోమవారం స్థానిక మెప్మా కార్యాలయంలో మెప్మా సిఎం ఎం.భ్రమరాంబ అధ్యక్షతన పట్టణ పరిధిలోని 42 మంది డిజిటల్ లక్ష్మిలకు నిర్వహించిన శిక్షణ తరగతులలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన పోస్ట్ ఆఫీస్‌ల ద్వారా అమలు చేస్తున్న అన్ని రకాల సేవలపై ఆయన అవగాహన కల్పించారు. డ్వాక్రా మహిళలతో ఎకౌంటు ఓపెనింగ్, ఆధార్ ఎనేబుల్ పేమెంట్ సిస్టం, జనరల్ ఇన్స్యూరెన్స్, హెల్త్, వెహికల్, లైఫ్ ఇన్సూరెన్స్, గ్రూపు యాక్సిడెంట్ పాలసీ, మొబైల్ బ్యాంకింగ్ యాప్, ఫండ్ ట్రాన్స్‌ఫర్, బిల్లు పేమెంట్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ ఎన్.బాలాజీ రాజ్, పి.ఎగ్జిక్యూటివ్ వినయ్, మెప్మా సిఒలు శ్రీదేవి, నర్గీస్ పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు మహా పాదయాత్ర

ప్రజాశక్తి-కాకినాడ

కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకూ ఎస్‌సి సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన రాజ్యాంగ పరిరక్షణ మహాపాదయాత్ర సోమవారం కాకినాడ పట్టణానికి చేరుకుంది. ఇంద్రపాలెం అంబేద్కర్ సర్కిల్ వద్ద ఎస్‌సి సంఘాల నాయకులు ఘన స్వాగతం పలికారు. రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాదయాత్ర భానుగుడి సెంటర్ వరకూ కొనసాగింది. పాదయాత్రలో ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ ప్రసంగించారు. రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర దేశ రాష్ట్ర రాజకీయాల్లో గొప్ప మలుపు తీసుకొస్తుందని పేర్కొన్నారు. ఎస్‌సి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్, ఆర్పిఐ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి చెన్నకేశవులు, పలు సంఘాల నాయకులు శివ ప్రసాద్, మేఘరాజు, సతీష్ కుమార్, బుజ్జిబాబు, అశోక్ కుమార్, సాధనాల రాజు, శ్రీనివాస్, పాల్గొన్నారు.

అన్నదాత పోరు పోస్టర్ల ఆవిష్కరణ

వైసిపి మంగళవారం చేపట్టిన అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సోమవారం పలుచోట్ల ప్రచారం చేపట్టారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

రౌతులపూడి పార్టీ మండల అధ్యక్షుడు చింతకాయల సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి జమీలు, జెడ్‌పిటిసి గొల్లు లక్ష్మణమూర్తి, నాయకులు వాసిరెడ్డి భాస్కర్ బాబు, గొల్లు వెంకటరమణ, సర్పం శ్రీను పాల్గొన్నారు.


గండేపల్లి పార్టీ మండల అధ్యక్షులు మద్దిపట్ల రామకృష్ణ పోస్టర్ ఆవిష్కరించారు. ఎంపిపి చెలగళ్ల దొరబాబు, రామకుర్తి శ్రీరామచంద్రమూర్తి, అవసరాల పార్థసారథి, తాళ్లూరు మధు కుమార్, కామేశ్వరరావు పాల్గొన్నారు.

యు.కొత్తపల్లి పోస్టర్ ఆవిష్కరించారు పిఠాపురం వైసిపి ఇన్చార్జ్ వంగా గీత కాకినాడ స్వగృహం నుండి ఉదయం హాజరు కావాలని తెలిపారు.

ప్రత్తిపాడు వైసిపి మండల కన్వీనర్ రామిశెట్టి నాని అన్నదాత పోరుయాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లా ఉపాధ్యక్షులు బెహర దొరబాబు, దళే చిట్టిబాబు, గుడాల వెంకటరత్నం, రెడ్డి నాయుడు, మదినే నూకరాజు, దాడిశెట్టి నూకపతి పాల్గొన్నారు.

జగ్గంపేట వైసిపి కార్యాలయంలో పార్టీ శ్రేణులు అన్నదాత పోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు. రావుల గణేష్ రాజా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తుల రాము, రామకుర్తి జాగాలు, కాపవరపు ప్రసాద్, కరుటూరి వీర్రాజు, భూమడ గణపతి రావు, నకిరెడ్డి విష్ణు, గుర్రం మహాలక్ష్మి, నక్కా శ్రీను, తదితరులు పాల్గొన్నారు.


ప్రత్తిపాడులో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు


కళాకారులను సన్మానిస్తున్న ప్రతినిధులు

భజన కళాకారులకు బహుమతి ప్రదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

కొండపల్లిలో నిర్వహించిన భజన పోటీల్లో విజేతలకు సోమవారం బహుమతులు అందజేశారు. పురుషుల విభాగంలో ప్రథమ బహుమతి సూర్య చక్రం బృందం (జల్లిపేట), ద్వితీయ బహుమతి రామకృష్ణ బృందం (వన్నెపూడి), తృతీయ బహుమతి వీరబాబు బృందం (ఉలిమేశ్వరం), ఉత్తమ హార్మోనియం వెంకటేశ్వరరావు, ఉత్తమ డోలక్ కురిమల దొరబాబు, ఉత్తమ గాయకుడు రామకృష్ణ ఎంపికయ్యారు. మహిళల విభాగంలో ప్రథమ బహుమతి శ్రీలలితా మహిళా బృందం (మర్లావ), వెంకట గణపతి మహిళా బృందం (వడిసలేరు) గెలుచుకున్నారు. తృతీయ బహుమతి శ్రీసత్య శారదా మహిళా బందం (ధర్మవరం), ఉత్తమ గాయనిగా నర్మజ గెలుచుకున్నారు. ఉత్తమ హార్మోనియం కళాకారుడుగా టి.వీరబాబు, ఉత్తమ డోలక్ కళాకారునిగా ఎస్.వీరబాబు ఎంపికయ్యారు. అనంతరం విజేతలైన కళాకారులను సన్మానించారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి-పిఠాపురం

మండలంలోని చిత్రాడలో ఆటో ఢీకొని ఒక మహిళ మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి సోమవారం రాత్రి గ్రామానికి చెందిన ఎం శేషారత్నం(58) రోడ్డు దాటుతుండగా కాకినాడ నుంచి పిఠాపురం వైపు వస్తున్న ఆటో బలంగా ఢీకొనడంతో శేషారత్నం ఘటనా స్థలంలోనే స్పృహ కోల్పోయింది. దీంతో స్థానికులు హైవే అంబులెన్సులో పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ప్రమాద సంఘటనపై పట్టణ ఎస్ఐ మణికుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసుల్లో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-శంఖవరం

అన్నవరం పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీ కేసుల్లో ఇద్దరు మహిళలను అరెస్ట్ చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్టు ప్రత్తిపాడు సిఐ సూరి అప్పారావు తెలిపారు. గోకవరం గ్రామానికి చెందిన తొండ శాంతి, ఆవుల భూలక్ష్మి ఆర్‌టిసి బస్సులు, ఆటోల్లో ప్రయాణిస్తున్న మహిళా ప్రయాణికుల దృష్టి మళ్లించి బ్యాగులను తస్కరిస్తూ నగదు, బంగారు వస్తువులను అపహరించేవారని తెలిపారు. వీరిద్దరూ ఏలేశ్వరం, ప్రత్తిపాడు, రౌతులపూడి, అన్నవరం స్టేషన్ పరిధిలో పలు కేసులు నమోదైనట్టు తెలిపారు. వారి నుంచి రూ.2 లక్షల నగదు, 106 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో అన్నవరం ఎస్ఐ హరిబాబు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలోని గరప్పాడు గ్రామానికి చెందిన సూరగాని రమ్యశ్రీ (19) అదృశ్యమైందని ఆమె తల్లి సూరగాని సాయిలక్ష్మి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఉదయం 11 గంటల సమయంలో ఇంటి నుంచి బయటికి వెళ్లిన తమ కుమార్తె తిరిగి ఇంటికి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ దొరలదేని తెలిపారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ కె.నరేంద్ర తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - కొత్తపేట

కొత్తపేట మారుతి సెంటర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రావులపాలెం మండలం దేవరపల్లి గ్రామానికి చెందిన అప్పారి సత్యనారాయణ వ్యక్తిగత పనిపై ద్విచక్రవాహనంపై కొత్తపేట వచ్చాడు. కొత్తపేట నుంచి రావులపాలెం వెళ్తుండగా కొత్తపేట మారుతీ సెంటర్‌లో వెనక నుంచి వచ్చిన లారీ సత్యనారాయణను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అతని కాలుకు తీవ్రగాయం అయింది. ఇదే తరుణంలో ఎంఎల్ఎ బండారు సత్యానందరావు కొత్తపేట నుంచి పలివెల వెళ్తూ ప్రమాద సంఘటనను చూసి ఆగారు. క్షతగాత్రున్ని ఆసుపత్రికి తరలించేందుకు చర్యలు తీసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని కొత్తపేట ప్రభుత్వాసుపత్రి వైద్యులను ఆదేశించారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ జి.సురేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రఘురామ్‌ను సత్కరిస్తున్న వైసిపి నాయకులు

రఘురామ్‌కు ఘన సత్కారం

ప్రజాశక్తి - జగ్గంపేట

వైసిపి సీనియర్ నేత ఒమ్మి రఘురామ్‌ను పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమించడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సోమవారం ఆయన స్వగృహంలో ఘనంగా సన్మానించారు. పార్టీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న ఆయనను పార్టీ అధినేత వైఎస్ జగన్ రాష్ట్ర కార్యదర్శిగా, కాకినాడ రూరల్ పరిశీలకులుగా నియమించారు.

విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభం

ప్రజాశక్తి - సఖినేటిపల్లి

మండలంలోని గుడి మూల గ్రామంలో నూతనంగా నిర్మించిన 33/11 కెవి సబ్ స్టేషన్‌ను ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ సోమవారం ప్రారంభించారు. రూ.4 కోట్లతో నిర్మించిన ఈ సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవంతో గుడిమూల, రామేశ్వరం గ్రామాలకు విద్యుత్ సమస్యలు తొలిగనున్నాయి. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దెందుకూరి శ్రీహరిరాజు, ఎస్ఇ రాజేశ్వరి, ఎఇ ప్రసాద్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ పెద్దకాపు, గెడ్డం మహాలక్ష్మిప్రసాద్, పినిశెట్టి బుజ్జి పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించుకున్న రైతులు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

అధికారులు, ప్రజా ప్రతినిధుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగినా ఫలితం లేకపోవడంతో రైతులే స్వచ్ఛంధంగా ముందుకొచ్చి రోడ్డును నిర్మించుకున్నారు. ఆత్రేయ పురం బుల్లిపేట నుంచి వాడపల్లికి వెళ్లే రహదారిలో ఏడేళ్ల క్రితం సిసి రోడ్డును ప్రభుత్వం నిర్మించింది. అక్కడి నుంచి లొల్ల రజకపేట నుంచి స్మశాన వాటికకు వెళ్లే కాలువ గట్టు సుమారు 600 మీటర్ల పైబడి మట్టి రోడ్డు ఉంది. ఆ రోడ్డు కొద్దిపాటి వర్షానికే బురదమయంగా మారుతోంది. ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రజల ఇబ్బందులను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. దీంతో రైతులు సుమారు రూ. 2 లక్షలను స్వచ్ఛంధంగా సేకరించి రోడ్డును వేసుకుని అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యాన్ని ఎండగట్టారు.

ఘనంగా అన్నదాన వార్షికోత్సవం

ప్రజాశక్తి - కొత్తపేట

పలివెలలోని ఉమా కొప్పులింగేశ్వర స్వామి ఆలయంలో అన్నదాన వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ బండారు సత్యానందరావు పాల్గొన్నారు. తొలుత స్వామి వారిని ఆయన దర్శించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

రైతులు యాంత్రీకరణ అవర్చుకోవాలి

ప్రజాశక్తి-తుని

మెట్ట ప్రాంత రైతాంగం యాంత్రీకరణ వ్యవసాయాన్ని అలవర్చుకోవాలని తుని ఎంఎల్ఎ యనమల దివ్య అన్నారు. సోమవారం వల్లూరు, టి.తిమ్మాపురం గ్రామాలకు చెందిన ఇద్దరు రైతులకు సబ్సిడీతో ప్రభుత్వం ఇచ్చిన రెండు వ్యవసాయ డ్రోన్లను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ యాంత్రీకరణ వల్ల పెట్టుబడి తగ్గి అధిక లాభాలను పొందవచ్చని, డ్రోన్‌ల ద్వారా పంట పొలాలకు ఎరువులు వేయడంలోనూ, క్రిమిసంహారక మందులు చల్లడంలోనూ అతి తక్కువ సమయంలోనే అధిక పంట పొలాలకు ఎరువులు క్రిమిసంహారక మందులు చల్లడం ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బొప్పన రాము, యనమల రాజేష్, చింతమనేడు అబ్బాయి, కాపారపు అబ్బులు, అత్తి అచ్యుతరావు, అత్తి సత్తిబాబు పోల్నాటి కృష్ణ, ఎడ్ల అప్పలరావు, అత్తి వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



రైతులకు డ్రోన్లు పంపిణీ చేస్తున్న తుని ఎంఎల్ఎ దివ్య

బస్సుల కొరతతో విద్యార్థుల కష్టాలు

ప్రజాశక్తి -కరప

మండల కేంద్రమైన కరపలో కాలేజీ విద్యార్థులు ఆర్‌టిసి బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కళాశాలలకు చేరుకోవడానికి విద్యార్థులు ఆర్‌టిసి బస్సులపై ప్రధానంగా ఆధారపడుతుంటారు. మండల కేంద్రమైన కరప నుంచి పెదపూడి మండలం సంపర, పుట్టకొండ, కాండ్రేగుల, సహపురం, కరప మండలం అరట్లకట్ట, గొడ్డటిపాలెం, జెడ్.భావారం, కొరుపల్లి, వలసపాకల, వేములవాడ వేళంగి గ్రామాల నుంచి వందలాది మంది పేద విద్యార్థులు ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణం కొనసాగిస్తున్నారు. వీరికి ప్రత్యేకమైన బస్సులు వెయ్యకపోవడంతో ఎంతోకాలంగా అవసత్థలు పడుతున్నారు. ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన ఉచిత ప్రయాణంతో విద్యార్థులకు పాఠశాలకు చేరుకునేందుకు ఇబ్బందులు పెరిగాయి. మహిళా ప్రయాణికులు పెద్ద ఎత్తున ప్రయాణం చేస్తుండడంతో బస్సుల్లో సీట్లు ఖాళీగా లేని పరిస్థితి నెలకొంది. దీంతో విద్యార్థులు ఎక్కేందుకు అవకాశం కూడా లేకపోవడం వల్ల ఫుట్‌బోర్డ్‌పై వేలాడుతూ ప్రయాణం చేస్తున్నారు. విద్యార్థులకు ప్రత్యేక బస్సులు వేయాలని వారు కోరుతున్నారు.



ఫుట్‌బోర్డ్‌పై విద్యార్థులు, దిగిపోవాలని కోరుతున్న డ్రైవర్

ఇమామ్‌ల గౌరవ వేతనాలు విడుదల చేయాలి

ప్రజాశక్తి-కాకినాడ

ఆదాయం తక్కువ ఉన్న మసీదుల్లో పని చేస్తున్న ఇమామ్, మౌజన్‌లకు ఇవ్వాల్సిన 11 నెలల గౌరవ వేతనాలు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ముస్లిం మైనారిటీ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాకు వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2025 సెప్టెంబర్ వరకు ఎనిమిది నెలల గౌరవ వేతనాల బకాయిలు, ఎలక్షన్ కాలంలో ఇవ్వాల్సిన మూడు నెలల గౌరవ వేతనాలు పెండింగ్‌లో ఉన్నవి మొత్తం కలిపి 11 నెలలవి ఇవ్వాల్సి ఉందన్నారు. వైసిపి నాయకులు ఎస్‌కె.కరీం బాషా, ఎండి బాషా, ఖాలిద్ బిన్ వాలిద్, రెహమాన్ ఖాన్, హేమంత్, సత్యనారాయణ, అజ్జు, మయూరి అలీషా, చాంద్ బాషా, ఇర్ఫాన్, నౌషద్, కిషోర్, జిలాని, జాఫర్, మున్నా పాల్గొన్నారు.



జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాకు వినతిపత్రం ఇస్తున్న ముస్లిములు

జనార్ధన స్వామి ఆలయంలో ఎసి తనిఖీలు

ప్రజాశక్తి - ఆలమూరు

స్థానిక జనార్ధన స్వామి ఆలయంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, వెండి బంగారు ఆభరణాల తనిఖీదారు విళ్ళ పల్లంరాజు సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి మూడేళ్లకోసారి స్వామివారి ఆభరణాలను తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. ఆభరణాలన్నీ నూటికి నూరు శాతం క్వాలిటీ, క్వాంటిటీలో లెక్కలకు సరిపడా ఉన్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం పాలకమండలి ఛైర్మన్ బైరిశెట్టి రాంబాబు, సభ్యులు చిన్నం సుబ్బలక్ష్మి, అయినవిల్లి శ్రీనివాస్, ఇఒ నరేంద్రకుమార్ పాల్గొన్నారు.

జెడ్‌పి పాఠశాలకు స్పోర్ట్స్ ఎక్స్‌లెన్స్ అవార్డు

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

స్థానిక జడ్‌పి ఉన్నత పాఠశాలకు స్పోర్ట్స్ ఎక్స్‌లైన్స్ అవార్డును సాధించిందని పాఠశాల హెచ్‌ఎం వంగా శ్రీనివాస్ తెలిపారు. గురుపూజోత్సవం సందర్భంగా అమలాపురంలో జరిగిన ఉత్తమ ఉపాధ్యాయుల సమావేశంలో కలెక్టర్ మహేష్‌కుమార్, డిఇఒ సలీం బాషా చేతుల మీదుగా ఈ అవార్డును అందుకోవడం జరిగిందన్నారు. గత మూడు సంవత్సరాలుగా 5,2,4 స్థానాలు సాధిస్తూ జిల్లాలో ఉత్తమ పాఠశాలగా అవార్డు సాధించిందని తెలిపారు.

టిడిపి మండల అధ్యక్ష పదవిని ఎస్‌సిలకు కేటాయించాలి

ప్రజాశక్తి - అయినవిల్లి

టిడిపి జిల్లా అధ్యక్ష పదవిని ఎస్‌సిలకు కేటాయించాలని మండల టిడిపి నాయకులు అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం స్థానిక సర్పంచ్ కాకర బాబ్జి నివాసం వద్ద ఎస్‌సి సామాజికవర్గానికి చెందిన పలువురు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎఎంసి డైరెక్టర్ మోర్త సత్తిబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గత ప్రభుత్వం రద్దు చేసిన 27 దళిత పథకాలను పునరుద్ధరించిన సిఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. టిడిపిని గ్రామ స్థాయిలో విస్తరిం చేదుకు కృషి చేస్తామని అన్నారు. జిల్లాలో అధిక సంఖ్యలో ఎస్‌సి సామాజికవర్గం ఉందని, కావున టిడిపి జిల్లా అధ్యక్ష స్థానాన్ని ఎస్‌సిలకు కేటాయిం చాలని కోరారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలోనూ మెజార్టీ స్థానాలను కైవశం చేసుకునేందుకు ఈ నిర్ణయం ఎంతగానో ఉపకరిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి సెల్ అధికార ప్రతినిధి మోర్త వెంకటేశ్వరరావు, నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడు బదుగు భాస్కర్ జోగేష్, నాయకులు గుమ్మళ్ల సాగర్, సరెళ్ళ సత్య నారాయణ, కుమ్మరి రమణ, కుసుమ బహుగుణ, పినిపే ప్రభుదాస్ పాల్గొన్నారు.

పని భారం తగ్గించేలా చర్యలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

పని వత్తిడితో సతమతమవుతున్న వార్డు సచివాలయ సెక్రటరీలపై పని భారం తగ్గించేలా చర్యలు తీసుకోవాలని సెక్రటరీలు కోరారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ రాజును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు సచివాలయ ఉద్యోగులు మాట్లాడుతూ మనమిత్ర వాట్సాప్ సేవ కోసం ఇంటింటికి వెళ్లి గతంలో వాలంటీర్లు క్లస్టర్లలో మ్యాపింగ్ చేసి క్యాంపెయిన్ చేసేవారని తెలిపారు. ఆ విధంగా తమను చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం దారుణమన్నారు. తమపై పని ఒత్తిడిని తగ్గించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు మద్దాల బాపూజీ, సంఘ నాయకులు రాయుడు శివరామకృష్ణ, విత్తనాల హరికృష్ణ, సాపిరెడ్డి శ్రీనివాస్, దుర్గాప్రసాద్, .నాగేశ్వరరావు, సత్యవేణి, వీరలక్ష్మి పాల్గొన్నారు.

రైతులకు యూరియా పంపిణీ

ప్రజాశక్తి - యంత్రాంగం

కపిలేశ్వరపురం కాలేరు, నల్లూరు, వెదురుమూడి గ్రామాల్లో మండల ప్రత్యేక అధికారి విజయలక్ష్మి ఆధ్వర్యంలో రైతులకు యూరియాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ జి.శ్రీనివాస్, ఎఒ బి.రవి మాట్లాడుతూ నానో ఎరువులు వినియోగించడం ద్వారా రైతులు అధిక లాభాల పొందవచ్చని అన్నారు. **ఉప్పలగుప్తం** మండలంలోని భీమనపల్లి సొసైటీ వద్ద రైతులకు యూరియాను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు ఆకేటి శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. మండల వ్యవసాయ అధికారి జి.కుమార్‌బాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో పంచాయతీ ఉపాధ్యక్షుడు కోలపల్లి గోవిందరాజులు, రైతులు కోలపల్లి పుల్లయ్య, ఆకేటి రామకృష్ణ, సొసైటీ సిఇఒ పోలిశెట్టి దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు. **మామిడికుదురు** 50 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని మండల వ్యవసాయాధికారి ఎన్‌వివి.సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు మామిడికుదురులో 20 మెట్రిక్ టన్నులు, ఈదరాడలో 20 మెట్రిక్ టన్నులు, మొగలి కుదురులో పది మెట్రిక్ టన్నులు యూరియా పంపిణీకి సిద్ధంగా ఉందన్నారు. అవసరమైన రైతులు యూరియాను తీసుకువెళ్లి సద్వినియోగం చేసుకోవాలన్నారు. **ఆత్రేయపురం** వద్దిపర్రు ఆర్‌ఎస్‌కె వద్ద యూరియా లభ్యతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్తపేట వ్యవసాయ అధికారి రామారావు, తహశీల్దార్ టి.రాజేశ్వరరావు, మండల వ్యవసాయ అధికారి భార్గవ్ మహేష్ పాల్గొని మాట్లాడారు. ఆత్రేయపురం, అంకంపాలెం సొసైటీలలో 60 టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. **కొత్తపేట** స్థానిక సచివాలయంలో యూరియా కొరతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రయివేట్ పరం చేయడం దుర్మార్గం

ముమ్మిడివరం : మెడికల్ విద్యను ప్రయివేటుపరం చేయడం దుర్మార్గమని బహుజన సమాజ్ పార్టీ నాయకులు అన్నారు. సోమవారం స్థానిక పోలమ్మ చెరువు గట్టుపై ఉన్న బుద్ధ పార్కు ఆవరణలో బిఎస్‌పి నియోజకవర్గ అధ్యక్షుడు బదుగు భీమేశ్వరరావు అధ్యక్షతన అత్యవసర సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌ఛార్జ్ వాకపల్లి భీమారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రయివేటుపరం చేయడాన్ని ఖండించారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీలు వైద్య విద్యకు దూరం అవుతారన్నారు.

భారీ వర్షానికి కూలిన ఇంటి పైకప్పు

ప్రజాశక్తి-గొల్లప్రోలు

గొల్లప్రోలులో ఆదివారం సాయంత్రం కురిసిన భారీవర్షం, ఈదురు గాలులకు ఇంటి పైకప్పు పడి పోయింది. గొల్లప్రోలు పట్టణంలోని మార్కండేయపురానికి చెందిన రాపర్తి గనిరాజుకు చెందిన ఇంటి పైకప్పు కూలిపోయి సామాన్లు విరిగిపోయాయి. వారు నిరాశ్రయులయ్యారు. కూలిపోయే సమయానికి కుటుంబం బయటకు పరుగులు తీయడంతో పెను ప్రమాదం తప్పినట్టు స్థానికులు తెలిపారు.

ముద్రగడను కలిసిన ముదునూరి

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

మాజీ మంత్రి వైసిపి పిఎసి సభ్యులు ముద్రగడ పద్మనాభం, ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబును సోమవారం కిర్లంపూడిలో ముద్రగడ నివాసంలో వైసిపి నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణంరాజు కలిశారు. నియోజకవర్గంలో పార్టీ స్థితిగతులపై చర్చించారు. అనంతరం మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ 2029లో ప్రత్తిపాడు నియోజకవర్గంలో వైసిపి జెండాను ఎగరవేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జువ్వల దొరబాబు, కోలా తాతబాబు, పోకనాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న నాయకులు

ఆక్వా రైతులపై విధించిన పన్నులు తగ్గించాలి

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

ఆక్వా రైతులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన 50 శాతం పన్నులు తగ్గించాలని సోమవారం రైతు సంఘం జిల్లా కార్యదర్శి గురాల అప్పారెడ్డి, రైతు సంఘం నాయకులు జి.వెంకటసుబ్బరెడ్డి రొయ్యల చెరువుల రైతులను కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 10న విజయవాడలో జరిగే రొయ్య రైతుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని వారు కోరారు.

యానాం వార్తలు

సిఎస్ఆర్ నిధులు సక్రమంగా వినియోగించాలి

ప్రజాశక్తి-యానాం

ప్రాంతీయ పరిపాలన అధికారిగా బాధ్యతలు చేపట్టిన అంకిత్ కుమార్‌ను రిటైర్డ్ అండర్ సెక్రెటరీ గిడ్డి బలరామ్, ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమ సంఘం అధ్యక్షుడు పండు సిద్ధార్థ కుమార్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనకు సంబంధించి పలు అంశాలను చర్చించారు. దీనిలో ముఖ్యంగా సిఎస్ఆర్ నిధులు యానాం అభివృద్ధికి సక్రమంగా ఉపయోగించాలని కోరారు. అనంతరం వినతిపత్రాన్ని అందించారు.



ఫిజియోథెరపీ డేలో పాల్గొన్న ఆర్ఎఒ అంకిత్ కుమార్

ఘనంగా వరల్డ్ ఫిజియోథెరపీ డే

ప్రజాశక్తి - యానాం

భారత సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ సహకారంతో డైరెక్టర్ బివి రామ్ కుమార్ ఆధ్వర్యంలో సోషల్ వెల్ఫేర్, ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ అధ్యక్షతన స్థానిక చిల్డ్రన్ ఆడిటోరియంలో వరల్డ్ ఫిజియోథెరపీ డేను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆర్ఎఒ అంకిత్ కుమార్ పాల్గొన్నారు. అనంతరం ఫిజియోథెరపీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ యెతేంద్ర కుమార్, ఎస్‌పి.రెడ్డి, మిషన్ శక్తి కోఆర్డినేటర్ రిఫ్కా రోషియో, శ్రీకాంత్, ఇన్‌ఛార్జి కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

పైప్‌లైన్ లీకేజీ ప్రాంతం పరిశీలన

ప్రజాశక్తి - యానాం

కొన్ని రోజుల క్రితం దరియాలతిప్ప ఐలాండ్ నెంబర్ 3 సమీపంలో ఓఎన్‌జిసికి సంబంధించిన గ్యాస్ పైప్‌లైన్ లీకేజీ ప్రాంతాన్ని ఆర్ఎఒ అంకిత్ కుమార్ అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ప్రజల ఫిర్యాదు మేరకు దరియాలతిప్ప వాటర్ ట్యాంకులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిటి జ్యోతి వెంకటేశ్వరరావు, మత్స్యశాఖ అధికారి డి.గొంతయ్య, పిడబ్ల్యుడి ఇఇ కాళ్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యతతో చైతన్యవంతమైన సమాజం

ప్రజాశక్తి - సామర్లకోట

దేశ ప్రగతి ఆ దేశ అక్షరాస్యతపై ఆధారపడి ఉంటుందని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ హెచ్‌ఎం తోటకూర సాయిరామ కృష్ణ పేర్కొన్నారు. సోమవారం స్కూల్లో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దీనిలో సాయి రామకృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిరంతరం ఏదో ఒక విషయం నేర్చుకోవాలని కోరారు. డిజిటల్ అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. సమాజం చైతన్యవంతం కావాలంటే ప్రతి ఒక్కరు అక్షరాస్యత కలిగి ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.హరనాథ్, ఉపాధ్యాయులు కెజి.భవాని, మహమ్మద్ సైదున్నీసాబేగం పాల్గొన్నారు.

ఎంపిడిఒలకు శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి - సామర్లకోట

శిక్షణ అనంతరం ఎంపిడిఒల్లో స్పష్టమైన మార్పు కనిపించాలని విస్తరణ శిక్షణాకేంద్రం ఉప ప్రిన్సిపల్ జి.రమణ సూచించారు. ఎంపిడిఒలుగా ప్రమోషన్ పొందిన ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి రెండో బ్యాచ్‌లో 42 మందికి నెల రోజులు ఇచ్చే శిక్షణ సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్రంలో సోమవారం ఘనంగా ప్రారంభమైంది. తొలి రోజు శిక్షణకు ముందు ఎంపిడిఒల పరిచయ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. నెల రోజుల ఈ శిక్షణతో పరిపాలన నైపుణ్యాలు మరింత పెంచుకోవాలని శిక్షణ కేంద్రం ఉప ప్రిన్సిపల్ రమణ అన్నారు. ఈ కార్యక్రమంలో డిడిలు శ్రీనివాస్, శర్మ, ఫ్యాకల్టీ సుశీల, శేషుబాబు, చక్రపాణి రావు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న ఉప ప్రిన్సిపల్ రమణ

ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా రమేష్

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ వి.రమేష్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుత సూపరింటెండెంట్ డాక్టర్ శైలజ కడియం ఆసుపత్రికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఏజెన్సీ ముఖద్వారంగా ఉన్న ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రిలో 24 గంటలూ వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. వైద్య సిబ్బంది డాక్టర్ రమేష్‌కు ఘన స్వాగతం పలికారు.